


# నిద్రమాత్రలు

హౌతశ్రీ

తొలి కోడి కూసింది.

ఆదమరిచి నిద్రపోతున్న రాఘవయ్య పక్కమీద అటు నించి ఇటు వొత్తిగిలాడు.

పక్షులు కలకంధ్వనులు చేయసాగాయి.

కోయిల మధురంగా గొంతు సారించింది.

రాఘవయ్య కళ్ళు తెరిచాడు.

పీ పీ మని సన్నాయి నొక్కులుగా గాలిలో తేలివచ్చి అతని కర్ణపుటాలకి సోకయి.

వీరాస్వామి సన్నాయికృతి చేస్తున్నాడు.

"వాతాపి గణపతింభజేహం–"

రాఘవయ్యకి ఆ స్వరం సుపరిచితం. అతనికి సంగీత జ్ఞానంలేదు. అయినా లోలోపల ఆ స్వరాన్ని అనుకరిస్తూ తన్మయుడయాడు. చల్లటి పిల్లగాలులు శరీరానికి హాయినిస్తూ అతనిని మరింత పరవశింప చేస్తున్నాయి. తలుపు తెరిచి వాకిట్లోకి వచ్చి కూర్చున్నాడు. అప్రయత్నంగా నాదస్వరానికి తాళంవేస్తూ తూర్పు ఆకాశంలోకి చూడసాగాడు. తెలతెలవారుతోంది. ఎదురుగా వున్న ఖాళీ స్థలంలోని మామిడిచెట్టు విరగబూచి కన్పించింది. పొద్దు తెలియని సంతోషంతో మామిడిచెట్టు మీదినించి కోయిల అదేపనిగా శ్రావ్యంగా ఆలాపన సాగిస్తోంది. చెట్టుకి చేరువలో వున్న పూరింటిలోంచి వీరాస్వామి నాదస్వర సాధన మంగళ

వదంగా మధురంగా వినవస్తోంది. చెట్టు మీదినించి పక్షులు నలుదిక్కులకి ఉల్లాసంగా రెక్కలు విప్పి ఎగిరిపోతూ కలకల ధ్వనులు చేస్తున్నాయి. తెల్లవారుజాము! మానవుడికిగల కొద్ది అదృష్టాల్లో అది మొదటిదని రాఘవయ్య అభిప్రాయం. ఆ శుభగడియలు ప్రసాదించే అలౌకిక ఆనందం అనుభవించటానికే అతను రాత్రి ఆదమరచి హాయిగా నిద్రపోలేడు. నాలుగు దిక్కులా తెల్లవారింది.

వీరాస్వామి మంగళం పాడాడు.

తాళం వేస్తున్న రాఘవయ్య చెయ్యి అప్రయత్నంగా ఆగిపోయింది. అతని మనసులో మాత్రం నాదస్వరం ఇంకా విని పిస్తూనే వుంది.

"దండాలు బాబూ" అన్న మాటలు విని రాఘవయ్య ఉలిక్కిపడ్డాడు.

"ఏం వీరాస్వామీ. పొద్దున్నే ఇలా వచ్చావు. ఏమిటి విశేషం?"

వీరాస్వామి కొంచెం తటపటాయించి గొంతు సరిచేసుకుంటున్నట్లు ఓ దగ్గు దగ్గి అన్నాడు.

"చిత్తం బాబూ ధర్మ రాజంటివారు. "తోటలో ఇల్లు వేసుకొని తోటపని చూసుకుంటూ ఉండు వీరాస్వామీ" అంటే తమ పేరు చెప్పుకొని ఇన్నాళ్లూ పొట్ట పోసుకుంటున్నాం బాబూ!"

"అవును. ఇప్పుడేమైంది." అన్నాడు రాఘవయ్య.

"అదేనండి. మాపటేళ నాంచారయ్య గారన్నారు. ఈ స్థలంలో రైసు మిల్లు పెడతారటగా?" "అనుమానం నివృత్తికోసం. వున్న విషయం బయటపెట్టాడు వీరాస్వామి. రాఘవయ్య వెంటనే ఏమీ అనలేదు. ఆలోచనలో పడ్డాడు. నాంచారయ్య చెవిలో ఇల్లు కట్టుకొని పోరుపెడుతూనే వున్నాడు. గట్టిగా ఏమీ చెప్పలేక "చూద్దాంలే" అన్నాడు. తనకెందుకు రైసు మిల్లు? ఈ వయసులో లేనిపోని బాదరబందీ.

"చూద్దాంలే వీరాస్వామీ. రైసుమిల్లంటే మాటలా!" అన్నాడు రాఘవయ్య.

"చిత్తం. మీదయ!" అని వీరాస్వామి సెలవు పుచ్చుకున్నాడు.

పదిగంటలవేళ నాంచారయ్య వచ్చినప్పుడు రాఘవయ్య చిరాకుపడ్డాడు. మిల్లు ప్రసక్తి అతను తెచ్చి తేముందే "అబ్బే. రైసు మిల్లంటే మాటలా, పోనిద్దూ." అని పెదవి విరిచాడు. నాంచారయ్య విసుగ్గా మాటలు కావయ్యా. డబ్బు మూటలే" అన్నాడు.

"ఆ ఇప్పుడు నాకేం కొదవ? ముప్ఫయి ఎకరాల మాగాణీ వుంది. రొక్కం పాతిక వేలుంది. అమ్మాయికి పెళ్ళి చేసేశాను. అబ్బాయి ఒక్కగా నొక్కడు, చదువుకొంటున్నాడు ప్రత్యేకంగా వాడికి ఆస్తి చాలదేమిటి" అన్నాడు రాఘవయ్య. నాంచారయ్య ఉత్సాహం మెండు. అంతకంటే ఆశ అధికం. అందుకు చాలినంత పెట్టుబడి మాత్రంలేదు. అందువల్ల రాఘవయ్య లాంటి మోతుబరిని రంగంలోకి దింపక తప్పదు. అదీకాక రాఘవయ్యకి ఆసాముల దగ్గరా, అధికార్లదగ్గరా కొంత ప్రాపకం



హీ త||శ్రీ

వుంది. అది వుపయోగించుకోవాలి. తన నేర్పంతా వినియోగించి రాఘవయ్యకి ఒక లెక్చరిచ్చాడు. గ్రామాల్లో పరిశ్రమల్ని నెలకొల్పటం ఎంత అవసరమో చెప్పాడు అదే దేశసేవ అన్నాడు. ఒక రైసుమిల్లు పెట్టడంవల్ల ఎన్ని కుటుంబాలకి ఉపాధి దొరుకుతుందో అంకెలతో వివరించాడు. అతని సంపద ఎంత పెరుగుతుందో కొలిచి చెప్పాడు. రాఘవయ్య ఇంకా నసుగుతూనే వుంటే చివరికి బ్రహ్మాస్త్రం ప్రయోగించాడు. "సరే ఇష్టం. సిరిరా మోకాలడ్డుతూ వుంటే ఏంచెయ్యను! ఉన్నవాలుగెకరాలూ అమ్మి ఆ రంగయ్య మిల్లు స్థాపించాలని చూస్తున్నాడు. అతనితోనే కలుస్తాను అతను లక్షలు సంపాదిస్తుంటే నువ్వు తెల్లముఖం వేసుకొని చూస్తూ కూర్చుందువుగాని."

నాంచారయ్యచరచరలేచి పోబోయాడు. రాఘవయ్య మెత్తబడ్డాడు. తనకి రావలసిన డబ్బు ఎవరికో రానివ్వటమా! అయినా తన పిచ్చిగానీ, అందరూ రెండు చేతులా డబ్బు సంపాదిస్తుంటే తనెందుకు సన్యాసం పుచ్చుకు కూర్చోవాలి!

"నాకీ మిల్లు విషయాలు తెలియవు నాంచారయ్యా." అన్నాడు రాఘవయ్య ఆలోచనగా.

"అవన్నీ నేను చూసుకుంటాగా." అన్నాడు నాంచారయ్య.

"అయితే సరే, నీ మాట కాదనటం ఎందుకు? అలాగే మిల్లు పెడదాం. అంగీకారం వెలిబుచ్చాడు రాఘవయ్య.

నాంచారయ్య ఎగిరి గంతువేసాడు.

ఆ సాయంకాలమే వీరాస్వామిని పిలిచి విషయం చెప్పాడు రాఘవయ్య. అతను కుంగిపోయాడు. అతనిది లేని సంసారం. ఎల్లవేళలా నాదస్వరం సాధన చేస్తూకాలం గడపడమేగానీ సంపాదన మీద ధ్యాస లేదు. పిల్లాపాపా ఎక్కువమందిలేరు. తోటలో పండించే కాయగూరలు అమ్ముకొంటూ ఎలాగో రోజులు వెళ్ళబుచ్చుతున్నాడు. ఇప్పుడు నిలువనీడ పోయిందంటే అతనికి ముచ్చెమటలు పోశాయి. ఎన్నో సంవత్సరాలనించి ఆ స్థలంలో వుంటున్నాడు. చేసేదిలేక తలదించుకొని వెళ్ళిపోయాడు. ఎవరినో ప్రాధేయపడి తలదాచుకోటానికి ఇంతజాగా సంపాదించుకొన్నాడు. సన్నాయి చేతపట్టుకొని కుటుంబముతో సహా అతను సెలవు తీసుకొని నడిచిపోతుంటే రాఘవయ్యగుండెగతుక్కుమంది. కానీ మిల్లుస్థాపించే మోజులోపడి వీరాస్వామినీ, అతని సన్నాయినీ కొంచెం తేలికగానే తన ఆలోచనలనుండి నెట్టివేశాడు. మొదట్లో అతను జ్ఞప్తికి వచ్చినపుడు హృదయం కలుక్కుమనేది. కానీ రానురాను అందుకు కూడా అవకాశంలేక పోయింది.

ఏ దుర్ముహూర్తాన మిల్లు ప్రారంభించారోగానీ, అప్పటినించీ రాఘవయ్యకు

మనశ్శాంతి కరువైంది. నాంచారయ్య పద్ధతులు అతనికి నచ్చటంలేదు. కానీ అతను కూడా వాటాదారు కావటంవల్ల గట్టిగా ఏమీ అనలేకపోతున్నాడు. అంత కంటే బలమైన కారణమేమంటే నాంచారయ్య విధానాలవల్ల లాభాలు అధికంగా వస్తున్నాయి. అందువల్ల రాఘవయ్య మనస్ఫూర్తిగా అతని చర్యలకు అడ్డుచెప్పలేక పోతున్నాడు. నాంచారయ్య ఎప్పుడో గొంతుమీదికి ఏదో తెస్తూవుంటాడు. ఏ అర్ధరాత్రోవచ్చి "నరుకు రవాణా చేస్తున్న మనలారీని 'వేఫారం' 'ట్రిప్‌షీట్' లేదని పోలీసులు పట్టుకున్నారట అర్జంటుగా పోవాలిపద." అని గాభరాపెట్టేస్తాడు. ఒక్కొక్కసారి భోజనానికి కూర్చోగానే ఉరుకులు పరుగులతోవచ్చి "మన మిల్లు తనిఖీచేస్తున్నారు, ఎక్సెస్ స్టాకుంది పట్టు కుంటే ప్రాణం మీదికొస్తుంది పద" అని తీసుకుపోతాడు. ఎవరికాళ్ళమీదో పడాలి వొస్తుంది. అవినీతి నిరోధకశాఖ వార్తలు పేపర్లో చూస్తుంటే రాఘవయ్యకి గుండెల్లో రైళ్ళు పరిగెత్తసాగాయి. రోజూ రాత్రిళ్ళుకలలు. మిల్లులాక్‌చేశారని ఉలిక్కి పడి లేస్తాడు. పగటినిద్రలో "సార్ సార్ దయుంచాలి." అని కలవరింతలు. ఒక్కొక్కసారి "ఆ లారీ మాదికాదండి." అంటూ నిద్రలోనే లేచిపరిగెత్తుతాడు.

రాఘవయ్య పరిస్థితి చూసి అతనిభార్య "మనకెందుకొచ్చిన మిల్లు. మీ భాగం వదులుకోండి." అని గోలపెట్టింది. కాని అతనికి చూస్తూచూస్తూ ఉట్టి పడి వస్తుంగా వస్తున్న లాభాలు వదులుకో బుద్ధిపుట్టలేదు. ఏక్షణానైనా అలాంటి ఆలోచన కలిగినా, నాంచారయ్య వెంటనే దాన్ని తుడిచివేసే వాడు.

రాను రాను రాఘవయ్యకి భయాందో ళనలు, అశాంతి ఎక్కువై నిద్రకరువైంది. ఎన్నో రాత్రులు జాగరణ చేయవలసి వచ్చింది. డాక్టర్‌కి చూపించుకొన్నాడు. రోగం ఏమీ లేదని తేల్చి రోజూ ఒకనిద్ర మాత్ర వేసుకోమని డాక్టర్ సలహాఇచ్చాడు. మొదట్లో ఒక మాత్రవేసుకొంటే నిద్ర పట్టేది. తర్వాత రెండు మాత్రలు వేసు కుంటేగానీ నిద్రవచ్చేదికాదు. ఆరోగ్యం సంగతి ఎలావున్నా రాఘవయ్య ఇనప్పె ట్టెలో కరెన్సీ నోట్లు మాత్రం బాగా పుంజు కోసాగాయి. రానురాను డబ్బే అతనికి లోక మైంది.

మిల్లుపెట్టిన కొత్తలో వీరాస్వామి అప్పుడప్పుడు వీధిలో ఎదురై దణ్ణంపెడితే "వీరాస్వామీ ఓసారివచ్చి సన్నాయి విని పించిపోవయ్యా. అని రాఘవయ్య నవ్వుతూ అనేవాడు. చిత్తం'అన్నా. వీరాస్వామి ఎప్పుడూ వచ్చేవాడుకాదు. తరువాత, తరు వాత అతను కన్పించటం మానేస్తే రాఘ వయ్య వాకబుచేసాడు. వీరాస్వామి ఊరు విడిచి వెళ్ళిపోయాడని తెలిసింది.

రానురాను రాఘవయ్య ఆరోగ్యం మరి చెడిపోయింది. మందులు ఏమీ పనిచేయ టంలేదు. నిద్రమాత్రల సంఖ్య ఎక్కువౌ తోంది. మనిషి చిక్కిపోయాడు. దిగజారి పోతున్నాడు. అతని పరిస్థితి చూసి ఓరోజు రాఘవయ్య భార్య పోరుపెట్టి పట్నంలో మంచి ప్రాక్టీసున్న డాక్టర్‌దగ్గిరికి తీసుకు వచ్చి పరీక్షయించింది. తగ్గేదాకా నర్సింగ్ హోంలోనే వుండాలని పట్టుబట్టింది. నర్సింగ్‌హోంలో వున్నప్పటినించీ రాఘ వయ్యకి కొత్తదిగులు పట్టుకొంది. అక్కడ మిల్లు ఏమౌతుందో? ఏ అధికారి తనిఖీకి వస్తాడో? ఏం ముప్పు కలుగుతుందోనని రాత్రింబగళ్ళు అదే ఆలోచన. ఓ వారం రోజులు కాగానే ఉండబట్టక, 'మిల్లు ఏమౌతుందో ఎళ్ళొక్కడ," అన్నాడు భార్యతో. "వాడుమిల్లు రేపోమాపో తగల బెట్టిస్తాను. అదిపోతేగానీ మీ ఆరోగ్యం మీకురాదు" అంది ఆవిడ. అదివిని రాఘ వయ్య మరీ బెంగపడిపోయాడు. ఒకవేళ భార్య అన్నంతపని చేస్తుందేమో! ఆవిడ పట్టుపడితే మొండిపట్టే, లేనిపోని అవస్థ తెచ్చుకొన్నాను తను. అన్నట్టు వీరాస్వామి ఎక్కడున్నాడో! ఊరువిడిచి పోయాడ న్నారు, బహుశా ఎక్కడో కచేరీలు చేస్తూ వుంటాడు మంచి విద్వాంసుడు. అతనికేం కచేరీల మీద కచేరీలు చేసి సంపాదిస్తూ వుండాలి. ఒక్కసారి వీరాస్వామి వచ్చి హాయిగా నాదస్వరం వినిపిస్తే ఆలోచన లతో కలత నిద్రపట్టింది రాఘవయ్యకి....,

ఒకపెద్ద మేడముందు పెళ్ళిపందిరి, పందిరిలోంచి నాదస్వర కచేరీ. వాతాపిగణ పతింభజేహం! హాయి, హాయి. రాఘ వయ్య పందిరి దగ్గరగా వెళ్ళాడు. అతని ముఖంలో ఆశ్చర్యం తాండవించింది. ఆ నాదస్వర విద్వాంసుడు మరెవరోకాదు. వీరాస్వామి! ఇంతవాడయ్యాడావీరాస్వామి. కచేరీ ముగిసిం తరవాత సన్నాయిసంచీలో పెడుతున్న ఆ విద్వాంసుడిదగ్గరగా వెళ్ళి రాఘవయ్య "వీరాస్వామీ" అన్నాడు. అతను తలెత్తిచూసి ఆశ్చర్యంతో "మీరా రాఘవయ్యగారు, కులాసానా?" అన్నాడు.

"ఏదో ఇలావున్నాను. నువ్వు వెళ్ళిం తర్వాత మనశ్శాంతిలేదు. పాడుమిల్లు. ఎక్కడ దాపురించిందో. "వీరాస్వామీ నువ్వొక్కసారి ఇంటికిరావాలి. హాయిగా నీ సన్నాయిపాట వినిపించాలి." రాఘవయ్య ప్రాధేయపడ్డాడు. "ఇప్పుడు విన్నారుగా." అన్నాడు వీరాస్వామి నిర్లిప్తంగా. "అలా కాదు. మనగ్రామంలో, మా ఇంట్లో, ఆ మామిడిచెట్టూ, ఆ ఇల్లూ, లేవనుకో- అయినా ఆ ఆవరణలో ఒక్కసారి, వీరా స్వామీ" వేడుకున్నాడు రాఘవయ్య. "సరే రాఘవయ్యగారూ." అన్నాడు వీరా స్వామి

బస్సు ఎక్కినప్పటినించీ వీరాస్వామి ఎన్నో విషయాలు చెప్పాడు-"ఎవరినో ఆశ్రయించి నానా అవస్థలుపడి సినిమాలో ఓ ఛాన్స్ సంపాయించాననీ, అందులో నేపథ్యంలో తననాదస్వరం ఒక నిమిషం సేపు వినిపించాలనీ, అప్పటినించీ దశ ఎత్తుకుందనీ కచేరీకి అయిదువందలు తీసు కుంటాననీ," అయితే నన్నుకూడా అయిదు వందలు ఇవ్వమంటావేమిటి కొంపతీసి?" అన్నాడు రాఘవయ్య నవ్వుతూ. "మరి గిరాకి అలాగేవుందండి. ఇప్పుడు మీతో వస్తున్నానన్నమాటేగానీ నాకు పీచుపీచు మంటూనేవుందండి. పొద్దున బుక్‌చేసు కోటానికి ఓ డైరెక్టర్‌గారు వస్తానని కబు రంపారు. కానీ రాలేదు. ఎందుకురాలేదో? సాయంకాలం వస్తారేమో, నేను మీతో వచ్చేస్తున్నా. మా పక్క వాయిద్యగాళ్ళకి మాట్లాడము తెలియదు. డబ్బుమాత్రం వందలకివందలు కావాలి. ఆ డోలు వాయి స్తాడే అతను వందిస్తేనేగానీ వుండనంటు న్నాడు. రేపు పెద్దకచేరీవుంది. కొంప ముంచుతాడో ఏమో! అసలు రేపు సాయం కాలం విజయవాడలో, ఎల్లుండి పొద్దున రాజమండ్రిలో ప్రోగ్రాములున్నాయి. విజ యవాడ కచేరీరైలు టైముకి అవుతుందో,

లేదో, వెళ్ళకృతో అనుకున్నమైముకి కచే రీలు కావం. రాజమండ్రి వెళ్ళకపోతే అయిదొందలు నష్టం. ఏమిటిలా సంపా దనలోపడ్డా పీరాస్వామి అని నవ్వుకుం టున్నారా? ఒకవిధంగా మీరే దారిచూపారు. రాఘవయ్యగారూ. సితి మంతులు మీరే ఆరోగ్యాన్ని లెక్క చేయకుండా మిల్లనీ యిదనీ అదనీ పాటుపడుతుంటే...."

రాఘవయ్య అతని వాక్ప్రవాహానికి అడ్డొచ్చి "నీ ఆరోగ్యం బాగున్నట్టులేదు పీరాస్వామి." అన్నాడు. "చిత్తం, ఈకచే రీలలో వేళకి నిద్రాతిండి వుండవుకదండీ."

ఇల్లుచేరింతర్వాత పీరాస్వామికి సుష్టుగా భోజనం పెట్టించి మిల్లు ఆవరణలో పక్క వేయించాడు రాఘవయ్య.

"ఎన్నాళ్ళయిందో పీరాస్వామీ సన్నాయి మీదనీ "వాతాపిగణపతింభజేహం" విని చెవులతుప్పు వదిలించు, ఈ తెల్లవారు జామున. వచ్చేపోవుకదూ? పోయినవస్తువు దొరకబోతున్నప్పటి ఆనందంతో, ఆశతో, వేడికోలుగా అడిగాడు రాఘవయ్య.

"చిత్తం" అన్నాడు పీరాస్వామి.

తనసామాయూలు నిద్రమాత్రలు రెండు వేసుకొని పక్కమీద వాలాడు రాఘవయ్య ఏ అర్ధరాత్రో నిద్రపట్టింది. కలతగా, క్రమంగా గాఢంగా, ఎండమీదపడి రాఘ వయ్య ఉలిక్కిపడి లేచాడు. పీరాస్వామి నాదస్వరం వినిపించనంత గాఢంగా తను నిద్రపోయాడా? ఛః నిద్రమాత్రలు వేసుకో కుండా వుండవలసింది. తనని తిట్టుకుంటూ రాఘవయ్య మిల్లు ఆవరణలోకి వెళ్ళాడు, పీరాస్వామికి క్షమాపణ చెప్పుకోవాలి. ఆవరణలోకి ప్రవేశించి రాఘవయ్య అదిరి పడ్డాడు వరండాలో పీరాస్వామి గురకపెట్టి నిద్రపోతున్నాడు. ఆశ్చర్యంతో అతన్ని తట్టిలేపాడు. పీరాస్వామి చప్పునలేచి రాఘ వయ్యనిచూసి తప్పుచేసినట్టు ముఖంపెట్టి "మన్నించండి బాబూ, మా చెడ్డ నిద్ర పట్టింది. ఒక్కడికీ ఒక్కటే నిద్రమాత్ర వేసుకొన్నా. ఇదిగో మీకిష్టమైన కీర్తన" అని సన్నాయి తీసుకొన్నాడు పీరాస్వామి.

"వాతాపిగణపతింభజేహం:".... తెల్లవారు జామున వీచే చల్లటి పిల్లగాలులమీద మధురమధురమైన నాదస్వర సంగీతం తేలివస్తోంది. మూతలుపడిన రాఘవయ్య కళ్లు నెమ్మదిగా తెరుచుకున్నాయి. చుట్టూ చూశాయి. తను నర్సింగ్‌హోంలోనే వున్నాడు.

"వాతాపిగణపతింభజేహం:"

చప్పున పక్కమీదినుంచి లేచాడు రాఘ వయ్య. చిరపరిచితమైన సన్నాయి నొక్కులు అతని శరీరంలోని అణుపణు వునీ ప్రకంపింప చేస్తున్నాయి. వరండా లోకి వచ్చాడు, గేటుదగ్గిర ఎవరో సన్నాయి వాయిస్తూ లీలగా ఆ మసక చీకట్లో కనిపిం చాడు. మంత్రముగ్ధుడిలా రాఘవయ్య గేటు దాకా వచ్చాడు. ఆ కటకటాల గేటుగడియ తీసి వాకిట్లోకి వచ్చాడు. "పీరాస్వామీ!" గట్టిగా ఒక్క అరుపుఅరిచి రాఘవయ్య ఆ వ్యక్తిని కౌగలించుకున్నాడు. "రాఘ వయ్యగారా," అన్నాడు పీరాస్వామి ఆశ్చ ర్యంతో "అవును పీరాస్వామీ. ఒంట్లో బాగుండక హాస్పిటల్లో చేరాను. ఎన్నాళ్ళ కెన్నాళ్ళకి చూసాను. ఎక్కడుంటున్నావు. ఏంచేస్తున్నావు?" మాసినగడ్డంతో- చిరుగు లుపడిన చొక్కా-ధోవతులతో నిలబడ్డ పీరా స్వామి రాఘవయ్యవైపు విషాదంగాచూసి చంకలో జోలె చూపించాడు, రాఘవయ్యకి గుండెపోటు వచ్చినంత పనైంది. కళ్ళ వెంట నీళ్ళు బొటబొటకారాయి. "పీరా స్వామీ, నన్ను క్షమించు. నాతోవచ్చేయి." అతని గడ్డంపట్టుకు బ్రతిమాలాడు రాఘ వయ్య గద్గదికంగా, పీరాస్వామి విషా దంగా నవ్వాడు.

"క్షమించండిరాఘవయ్యగారూ,నేనెవరి మీదా ఆధారపడదలుచుకోలేను. ఈసన్నాయే ఇంతకూడు పెడుతుంది." అతన్ని విడి పించుకొని పీరాస్వామి ముందుకివెళ్ళాడు,

"వాతాపి గణపతిం భ జే హ ం ...."

క్రమంగా దూరమౌతూ శాన్యంగా వినిపి స్తున్న ఆ నాదస్వరంలో ఎన్నడూలేని విషాదం గుండెల్ని పిండిచేస్తుంటే రాఘ వయ్య అచేతనంగా నిలబడిపోయాడు.

●□●


Pnone : 650

EVERESTINDUSTRIES

MURADABAD (U. P.)

Specialists in
Everest Brand
Non-Magnetic
Stainless Steel
Coloured

Presentation Articles like

Tray & RoundPlates Etc. Wholesale Dealers

1. TallamSatyanarayana & Sons, Vijayawada-1.

2. Durga Emporium Vijayawada-2.

3. Krishna Metal Stores, Vijayawada-2.

4. Rangapanaiah & Bros. Vijayawada-1

5. Durga Stainless Steel Stores, Rajahmundry:

6. Super Bazar, Visakhapatnam.